# బ్రతుకు తెరువు


## శ్రీమతి ఆర్. వసుంధరాదేవి


ఉదయం పదిగంటలైంది. చైత్రమాసపు సూర్యుడు ఆటకాయితనంగా కొంచెం జోరు చూపిస్తున్నాడు. బయట వరండాలో పడుతున్న ఎండ చురుకుదనం వాకిట్లోంచీ ముందు హాల్లోకి వచ్చి నన్ను చెమటతో స్నానం చేయిస్తోంది. విసనక్రరతో విసురుకుంటూ కూర్చున్నాను.

వాకిట్లో నీడపడ్డట్లయి తలెత్తిచూస్తే ఆ అమ్మాయి కన్పించింది. ఘరానా బిచ్చగాళ్ల ట్రేడ్ మార్కు అయిన నవ్వు మొహంనిండా అలముకొని ఉన్నది. ఘరానా బిచ్చగాళ్లంటే నాకు సరిపడదు. మనల్ని మోసంచేసి అల్లించి బెల్లించి సంపాదించాలని చూస్తారు వాళ్లు. మోసపోవడమంటే నాకు మహామంట.

'ఇంత లోపలికి ఎందుకొచ్చావ్? బయటవుండి అడగరాదూ?' గద్దించాను.

'కోప్పడవద్దండి...ఏదో మేమూ బ్రాహ్మలం' అన్నది.

'మేము కాదు. ఇహాపో' అన్నాను. నా తెలివికి నాకే నవ్వొచ్చింది,

'కోప్పడకుండా నా మాట కాస్త వినండమ్మగారు...' వినయంగా మంచి చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అదే నవ్వుతో మాట్లాడుతోంది.

'అతి వినయం ధూర్త లక్షణం' అనుకున్నాను.

'ఊరికే కాలం వృథా చేసుకోకుండా ఇంకో చోటుకువెళ్ళు. ఇక్కడేం లాభం లేదు' అన్నాను ధూర్తంగా, ఖచ్చితంగా. ఈ అమ్మాయి మోసంలో పడకూడదని ఘట్టిగా నిశ్చయించుకున్నాను. ఇదివరలో యిలాంటివాళ్ల కథలు వినడంవలన నష్టం కలిగింది నాకు. గుడ్డలో, డబ్బులో, బియ్యమో ముడుపు చెల్లించి వాళ్లనుపంపి తిరిగ్గా కూర్చుని 'ఛీ, దొంగమొహాలు. అన్నీ అబద్ధాలే చెప్పారు. ఇలాంటి వాళ్లకు ఏమైనా యివ్వడం తప్పు?' అని వాళ్లనీ నన్నూకూడా తిట్టుకున్నాను. మోసపోవడమంటే నాకు మహాచిరాకు. అందుకే యీ సారి ఖచ్చితంగా వ్యవహరిస్తున్నాను...కాని నా కోపానికి ఆ అమ్మాయి ట్రేడ్‌మార్కు నవ్వు ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

ఆ అమ్మాయి వయస్సు ఇరవైకి పైనా పాతిక్కులోపూ ఉంటుంది. సన్నగా పొట్టిగా ఉన్నది. మంచి పోషణ ఉంటే మంచి రంగే ఉండొచ్చు. కాని ఇప్పుడు ఆ రంగుమీద ఒక నల్లకప్పువేసిపోయింది. అనేకమైన వాకిళ్లలో ఎండలో నిల్చొని అడుక్కోవడాన్న కావచ్చును. ఎండలో నిల్చొని, నల్ల కప్పు వేసుకుపోతూ చెమటలు కార్చుకుంటూ అనునయంగా నవ్వుతూ అడగడమే సబబని ఆ అమ్మాయికి తోచి ఉండొచ్చును. నీడలోనికి జరిగి ఉండొచ్చునుగాని అలాగే ఎండలో నిలబడి మాట్లాడుతోంది. నేనూ జరగమనలేదు.

'నేను నిజంగా అడుక్కునేదాన్ని కాదమ్మ. హరికథలు చెప్పేవాళ్లం. ఏదో ఇప్పుడు ఆర్నెల్లబట్టి గొంతు దాసుకుపోయి కథలు చెప్పలేక ఆస్పత్రికి తిరుగుతూ...అయిదు నిమిషాలు కథ చెప్పేసరికి గొంతు బొంగురుగా అసయ్యంగా అయిపోతుంది. అందుకని చెల్లెలి చదువుకోసం అడగవలసివచ్చింది...' ఘరానాబిచ్చగాళ్లు నిజంగా అడుక్కునేవాళ్లు కారు.

ఏదో ఒక ఉపద్రవంవచ్చి మీదబడటాన సహాయం కోసం వచ్చిఉంటారు. అంతా పాతకథే.

'ఇదివరలో రెండేళ్లప్పుడు యీ వూళ్లో కూడా చెప్పాను...'

ఆ అమ్మాయి చెప్పేవీ చెప్పబోయేవీ అన్నీ అబద్ధాలేనని ముందే నిశ్చయించేసుకున్నాను.

'అసహ్యంగా యిట్లా అడుక్కోకపోతే కూలి పనిచేసుకున్నా పొట్టగడుస్తుందే...అసలు నీవు కథ యీ వూళ్లో ఎప్పుడు చెప్పావ్? ఎక్కడ చెప్పావ్? నీ పేరేమిటి? ఊరేమిటి? ఎవరు చెప్పించారు కథ? రెండేళ్లప్పుడు మేం యిక్కడే ఉన్నాం. మాకెందుకు తెలియలేదూ?...' అనేకమైన సందేహాలు వెలి బుచ్చాను. అన్నిటికీ ఏవో కుంటిసమాధానాలు చెప్పింది. నా సందేహం ఆ అమ్మాయి పసిగట్టే ఉంటుంది. సందేహించబడటమే వాళ్లకు సహజం అయ్యుండాలి.

'మీరు చెప్పినట్లు అడుక్కోవడం అసయ్యమే గాని మరీ కూలిపని అలవాటులేదమ్మ. కథలు చెప్పే వాళ్లం. జయిమినీభారతంలో మకరధ్వజుడికథా, అశ్వ మేధయాగమూ అట్లాటివన్నీ చెప్తాం' అన్నది.

ఆ మాట తీరూ యాసా అన్నీ గమనించిన కొద్దీ ఆ పిల్ల హరికథలు చెప్పేపిల్లకాదని తోచింది నాకు. మకరధ్వజుడికథ చెప్పమన్నాను. టూకీగా చెప్పింది. కాని ఆ చెప్పేవిధానంలో 'ఈ అమ్మాయి కింతకంటే తెలియదు' అన్నట్లు తెలుస్తోంది. ఈ అమ్మాయి నన్ను బోల్తా కొట్టించాలనుకుంటోంది. నాకు ఆ అమ్మాయిని బోల్తాకొట్టించాలని మహాసరదాగావుంది.

'నీవు కథ చెప్పడం ఎక్కడ నేర్చుకున్నావూ?' అన్నాను.

'కూచిపూడిలో...చలపతిగారని ఆయనపేరు. గొప్పవారు, మీరు వినేవుంటారు. గొప్పకథకులు' అన్నది. ఆ అమ్మాయి ముఖంలోని నవ్వులో ఏమార్పూ లేదు. అదే నవ్వు. 'నన్ను నమ్మ. నాకేమన్నా యివ్వు' అన్నట్లుగాఉంది. 'మేము ఇక్కడే ఊటుకూరులో ఉంటున్నాం. ఒక రెడ్డిగారికి పొలంలో మేడ వున్నది. పెద్దమేడ. అందులో ఒక గది యిచ్చారు మమ్మల్ని వుండమని...మాదేం వుందమ్మ. నీచవు బతుకులు...అసలు మాది రేపల్లెలెండి. ఆస్తి అంతా అమ్ముకునిపోగొట్టుకుని యిక్కడికి వచ్చేసినం. గొప్పదేశమని, బతకొచ్చని' అన్నది.

ఈ అమ్మాయి మాట్లాడినకొద్దీ దురాగ్రహమూ, నీచతనమూ, అబద్ధాలూ మరింతగా బయట కొస్తున్నాయి. అయితే వీళ్లు రెడ్డిగారి పొలంలోని మేడలోఉండే మాటనిజమే. అయితే నీచవు బతుకు అన్నది నిజమే అయ్యుండాలి. ఇలా అబద్ధాలు చెప్పు కుంటూ తిరిగి పైగా ఇంకొంచెం సంపాదించాలనుకుంటోందన్నమాట. ఈ పిల్లసంగతి తేల్చుకోవాలన్న పట్టుదల జాస్తిఅయింది. వాళ్లది రేపల్లె అనగానే నాకు ఉత్సాహం కలిగింది. మా పుట్టిల్లు రేపల్లె. 'చిక్కావులే' అనుకున్నాను.

'రేపల్లెలో నీ కెవరైనా తెలుసా?' అడిగాను.

సందిగ్ధంగా మొహం పెట్టింది. 'నాకు అంతగా తెలియదనుకోండి. మా నాన్నగారికయితే...' అంటూ నసిగింది.

నేను అట్లాగే నిశ్చలంగా ఆ పిల్ల ముఖాన్ని చూస్తూ ఉన్నాను.

ఆ అమ్మాయి కొంచెం తికమకపడి 'ఆ తెలుసు నండి. అక్కడ ఎక్కువగా కమ్మవారుంటారు. సర సింహారావు నాయుడుగారని పెద్దభూస్వామి. వారు మాకు బాగా తెలుసు' అన్నది.

పెద్దగా నవ్వాను. పడీ పడీ నవ్వాను. 'అక్కడ కమ్మవారు చౌదరి అని పెట్టుకుంటారుగాని నాయుడు అని పెట్టుకోరు' అన్నాను విజయోత్సాహంతో.

'ఉన్నారండీ. నిజంగా ఉన్నారే' అన్నది వెలగని నవ్వుతో.

'నీవు మాట్లాడుతుంటే తెలంగాణా యాస వినపడుతున్నది. నీది రేపల్లెకాదు' అన్నాను.

'ఇక్కడికి రాకముందు తెలంగాణాలో రెండేళ్లు కథలుచెప్తూ తిరిగిన మాట నిజమేగాని ఆయాస నాకు లేదే' అన్నది. అడగ్గానే రేపల్లెనుండి తెలంగాణాకు మార్చింది రంగస్థలం. నిస్సహాయంగా నా వేపు చూసింది—వేటగాడు తరుముతున్న లేడి లాగా. 'నిజానికి కథలు చెప్పేది మా నాన్నగారే నండి. నేను ఏదో అక్కడా యిక్కడా ఓతూరి చెప్తాను. మా నాన్నగారే నాకు నేర్పించినరు. ఆయన చలపతిగారి దగ్గర నేర్చుకున్నారు...చలపతిగారు పది మందికీ తెలిసినవారు. అరవై ఏళ్ల వయస్సులో చచ్చి పోబొయ్యేముందుగూడ బెజవాడలో ఆయన కథ చెప్పినప్పుడు జనం ఇసుకవేస్తే రాలకుండా వచ్చేవారు. పళ్లెంలోవేసే చిల్లర డబ్బులే నూటపదహార్లు పైగా ఉండేవి...వారి కథ గురించి అల్పపు మనుషులం, మాకేం తెలుస్తుంది. మీ బోటి పండితులు గ్రహించు తారు...మా నాన్నగారుకూడా మంచిపేరు సంపాదించి నరు. అనేక దేశాలు తిరిగినరు. ఇప్పుడిట్లా ఉన్నాం గాని అప్పుడు ఆయనకు ఎంత గౌరవం! ఎన్ని జహా మానాలు! ఎన్ని మెల్లిషులు!' అన్నది.

'ఏమిటే' అన్నాను అర్థంకాక.

'మెల్లిషులంటామండి. మెచ్చుకున్నవారిస్తరు. కోటుకి తగిలించుకుంటారు' అంటూ చేతో అభిన యంగా చూపింది. 'మెడల్సా?' అన్నాను, పిస్సగా నవ్వింది. 'అవునండి. పెద్దబంగారు జంధెమూ, బంగారూకడియాలూ అన్నీ ఉండేవి' అన్నది.

...బంగారుజంధ్యమూ, బంగారుకడియాలూ... కథచెప్పేదాసు ఎగిరెగిరిచెప్తుంటే గొలుసూ చెవుల పోగులూ చేతికడియమూ ఎగిరెగిరిపడుతూ నల్లని శరీరంమీద మెరిసిపోతుంటే...అకస్మాత్తుగా నా మెద డులో మెరుపు మెరిసింది.

'పదిహేనేళ్లక్రితం మీరు...వూరికి ఒచ్చారా?' అన్నాను.

ఆ అమ్మాయి మొహం సంతోషంతో విప్పా రింది. ఇందాకటి ట్రేడ్‌మార్కునవ్వు మాయమై




FDSA1454TE

పోయింది. 'అవునండీ, అవును. నేను, నా చెల్లెలూ, మా అమ్మాకూడా ఒచ్చాం. అన్నిచోట్లకీ పోయే వాళ్లం. బాగా జరుగుతున్న రోజులు. నాకు పదేళ్లుంటాయప్పుడు' అన్నది ఆనందంగా.

అయిదురోజులు బ్రహ్మయ్యగారికథ చెప్పాడు దాసు. మా ఊరివాళ్లకు దైవచింతన జాస్తి. వెంకటేశ్వరునికీ, శివుడికీ, పోతరాజుకీ, అంకమ్మకీ, అందరికీ పెద్దఎత్తున తిరుణాళ్లూ, బ్రహ్మోత్సవాలూ చేయిస్తారు. చుట్టుప్రక్కల్లో ఏ ఊరికి ఏదాసు ఒచ్చినా ఆయన్ని సగౌరవంగా ఆహ్వానించి కథ చెప్పిస్తారు. కథ చెప్పినన్నాళ్లూ ఆ కథకుడు కథానాయకుడౌతాడు. అతని గొప్పతనం అందరిచేతా ఏకగ్రీవంగా ఒప్పుకోబడుతుంది. పూటకొక్క యింటి చొప్పున దాసుకూ అనుచరులకూ పోటాపోటీలతో ఆతిథ్యం ఇస్తారు. ప్రతిఇంట్లోనూ పూలదండవేసి సత్కారం చేస్తారు. 'వాళ్లు పోళీలు చేసిపెట్టారా? మనం జిలేబిచేద్దాం'. 'వాళ్ళు సన్నజాజిమల్లెలదండ వేశారా? మనం మూడురూపాయలకు పూలహారం కట్టించివేద్దాం'. 'మనం గులాబ్ జాంచేసి...వెధవపూలదండ లెందుకూ, నక్కీదండ వేద్దాం'. 'వాళ్లింట్లో దాసుకి పంచే ఉత్తరీయం పెట్టారుట, రాత్రికి మనం ఉంగరం చదివిద్దాం'. దాసు మంచిలౌకికుడు. నలభై అయిదేళ్ల వయస్సులో, నల్లనిదృఢమైన శరీరంతో, ఎర్రనిపట్టుపంచే ఒంటినిండా బంగారునగలతో, ఎగిరెగిరి గంతులేస్తూ, కథచెప్తూ, మధ్యమధ్యన హేలగా బంగారుగొలుసుగల వాచీలో టైం చూసుకుంటూ, ఆనాడు తనకు సత్కారం చేసినవాళ్ల ఘనతను సున్నితంగా వివరిస్తూ, మధ్యమధ్యన చందాలపళ్లెం పంపుతూ......ఆ అయిదురోజులూ మా ఊరివారికి వేరేధ్యాసలేకుండా చేశాడు. దాసు నెట్లా సత్కరిద్దామాఅన్న పోటీలు పెరిగిపోయాయి. దాసు విశ్వబ్రాహ్మణుడు. బ్రహ్మయ్యగారు విశ్వబ్రాహ్మణులనే విషయం మరవటానికి వీల్లేకుండా కథ చెప్పాడు. విశ్వబ్రాహ్మణసంఘంవారు పదిరూపాయలనోట్లున్న దండగ్రుచ్చి ఆ సభలో దాసు మెళ్లో వేసి ధన్యులయ్యారు. వాళ్లిచ్చిన చందాలే నాలుగు వందలపైకి పోయాయి.

బ్రహ్మయ్యగారు సమాధిఅయ్యేరోజున నేను వెళ్లాను. మూడురోడ్ల కూడలిలో వేదికమీద దాసు. మూడురోడ్లమీదా ఫర్లాంగుదూరంవరకూ క్రిక్కిరిసి కూర్చున్న జనం. మామూలుగా కాలేజికి వెళ్లేప్పుడు చెప్పులులేకుండా ఆ రోడ్డుమీద కాలుపెట్టాలంటే అసహ్యం నాకు. ఆ రోజున బ్రహ్మయ్యగారికి మనసులో ఓ నమస్కారంచేసుకుని ఆ ఉమ్ములమట్టిలో కూర్చున్నాను. 'బ్రహ్మయ్యగారు సమాధి అయిపోయాక చందాలు తీసుకోము. సమయం దగ్గరకొచ్చేస్తోంది. ఇవ్వాలనుకున్నవారంతా వెంటనే పళ్లెంలో వేసి తరించండి. ప్రజల సౌకర్యంకోసం మూడు వైపులకీ మా మనుష్యులను ముగ్గురిని మూడు పళ్లెలతో పంపుతున్నాం. ఇంకో అరగంటటైం... పదిహేను నిముషాలు......అయిదు నిముషాలే...... ముహూర్తం సమీపిస్తోంది...బ్రహ్మయ్యగారు లేచారు. సమాధివద్దకు బయల్దేరుతున్నారు...అవకాశం మించిపోతోంది? బంగారువాచీలో టైం చూసుకుంటూ చిరునవ్వుతో దాసు హెచ్చరిస్తుంటే అనాలోచితంగా చేతిలోఉన్న రూపాయిని చందాలపళ్లెంలో వేశాను. అవకాశం మించిపోతుందన్న ఆత్రంలో కొంగుముళ్లు ఆత్రంగా విప్పేవారు బొడ్లో తడుముకునేవారు, 'యిదిగో, యిక్కడ, యిక్కడ' అంటూ కేకలువేసి, ఆత్రంగా ముందుకుఒంగి చందాలువేసే వారితో గల్లంతయిపోయింది. కొంతసేపూ...అంతకుముందూ ఆ తరువాతా ఎందరో దాసులువచ్చి ఎన్నోకథలు చెప్పారు. కాని అతని బంగారు జంధ్యాలూ, ఎత్తు భారీతనమూ వాళ్లకు లేవు. అతని లౌక్యం వాళ్లకులేదు.

'మావి నీచపు బ్రతుకులు. మా సంపాదన ఎంత ఒచ్చినా మాయమై పోతది. ఎట్లా పోతదోనని ఆశ్చర్యంగా ఉంటుంది. ఒక్కోసారి రోజుకి యాభై వంద, రెండొందలూ...అల్పపు బ్రతుకులు గనుక ఆవిరై పోతుందనుకుంటాను' తను చెప్పగా అందరూ ఒప్పుకున్న ఆ నిజాన్ని దానం చేసేవాడు పుచ్చుకునే

వాడిలో చూచే అల్పత్వాన్ని—నన్నూ ఔననమన్నట్లు చూచింది......అప్పుడు పట్టుపావడాలో బంగారు గొలుసూ గాజులతో దర్జాగాఉండి పాటలు పాడిన పిల్ల దాసుగారి కూతురి...

'మీ నాయన నీకు పెళ్ళెందుకు చెయ్యలేదు?'

అందరూ అడిగే ప్రశ్నకాదేమో. ట్రేడ్ మార్కు నవ్వు చెదిరిపోయింది. మొహంమీది నల్ల కప్పు మరింత నల్లబడింది. చెమట చుక్కలు ముక్కలుగా మొహం నిండా పరుచుకుంది. నీరసంగా కొంగుతో చెమట తుడుచుకుంది.

'ఆడదాని బ్రతుకెంతమ్మా. పెద్దమనిషయ్యాక పదేళ్ళు ఆడది. ఈ మాత్రపు భాగ్యానికి పెళ్ళి ఆ బాదరబందీ ఎందుకు చెప్పండి?'

'నేను నిన్ను సంతోషపెట్టానా?' అంటూ పెంపుడుకుక్క యజమానిని ప్రశ్నార్థకంగా చూచినట్లు చూచింది. ఆ చూపుకు తట్టుకోలేకపోయాను. దాసుమీద, సంఘంమీద, పరిస్థితుల మీద, నామీద అన్నింటిమీదా కోపం వచ్చింది. చేతగాని వాళ్ళకొచ్చే కోపం.

'పదేళ్ళేం. పాతికేళ్ళు. ముప్ఫైఏళ్ళు... మనిషి బ్రతుక్కి ఒక పరిమితి ఉంది. అందుకని బ్రతకటం మానేస్తామా?...అల్పత్వం, నీచత్వం అంటూ వేషం వెయ్యకు. మీ అమ్మా నాన్నా ఎందుకు నీకు పెళ్ళి చెయ్యలేదు? నీవు వెళ్ళిపోతే వాళ్ళ సంసారం గడవదనా?'

ఆ అమ్మాయి ముఖం మరింత వాడిపోయింది.

'అవునమ్మా. వాళ్ళు జబ్బులతో, ముసలితనంతో చేతకాని వాళ్ళయిపోయారు. చెల్లెలు చదువుకుంటుంది. నాకు పెద్దసంబంధాలు ఎక్కడ తెస్తారు?'

ప్రతిమనిషి జీవితమూ ఒక కథ. కర్మసూత్రాలకు కట్టుబడి నడిచేకథ. పైకి కనిపించే బాధ్యతారహితమైన పరాన్నభుక్కు నిర్జీవము వెనకాల ఎన్ని అగాధాలు! ఆ అమ్మాయి బేలతనంతో ఏడవకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటున్నందుకు మనసులోనే అభినందించాను. ఆ అమ్మాయిని గురించి జాలిపడటానికి నేనెవర్ని! అబద్ధమో నిజమో కథలు చెప్పి బ్రతకాలని ఆ అమ్మాయి నిశ్చయించుకుంటే దాన్ని కాదనటానికి, ఆ అమ్మాయిని హింసించటానికి నాకేం హక్కున్నది?

పాతచీరె బియ్యం యిచ్చాను.

అవి తీసుకుని వెళ్ళలేదు. 'అమ్మా. తమరు ఒక్క అష్టపదికూడా పాడమనలేదు...తమరిదేవూరు? ఏం పేరు? ఏం పని? ఏం కులస్థులు?...' ఇంకో కథ ప్రారంభించింది.

నాకు నవ్వొచ్చింది. 'ఇహ వెళ్ళు' అన్నాను.

'సంభావన ఏదైనా...' అన్నది.

'ఇంకో కథ ఇంకోచోట చెప్పి సంపాదించుకో. నీ నోటినిండా కథలు ఉన్నాయి. నీకేం ఫరవాలేదులే' అన్నాను.

ఆ పిల్ల నెత్తిమీద ఒక మొట్టికాయ వెయ్యాలనిపించింది. వెయ్యకుండా నవ్వాను. ఆ అమ్మాయీ నవ్వింది. ట్రేడ్‌మార్కు నవ్వుకాదు...నవ్వుతూ వెళ్ళిపోయింది ...